www.prajasakti.com

ప్రజాశక్తి

మంగళవారం 14 మార్చి 2023

5

ఏలూరు

కొవ్వూరులో ఓటింగ్‌కు ఇద్దరు దూరం

కొవ్వూరు రూరల్:స్థానిక సంస్థల ఎంఎల్‌సి ఎన్నికల్లో కొవ్వూరు ఎంపిడిఒ కార్యాలయంలో పోలింగ్ కేంద్రంలో 242 మందికి 240 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు. 99.17 శాతం పోలింగ్ నమోదైంది. ఎన్నికల సరళిని సహాయ రిటర్నింగ్ అధికారి, ఆర్‌డిఒ ఎస్.మల్లిబాబు, భద్రతా ఏర్పాట్లను అదనపు ఎస్‌పి ఎం.రజని, కొవ్వూరు డిఎస్‌పి విఎస్ఎన్.వర్మ పరిశీలించారు. ఎన్నికల జోనల్ అధికారి, ఏలూరు స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ ఎ.సత్యనారాయణ ప్రత్యక్షంగా పర్యవేక్షించారు. ఓటింగ్ పూర్తి అయిన తరువాత అధికారుల సమక్షంలో బ్యాలెట్ బాక్స్‌కు సీల్ వేసి, పోలీసు భద్రత మధ్య ఏలూరు తరలించారు.

ఓటేయని వారు వీరే

నిడదవోలు మున్సిపాల్టీకి చెందిన 12వ వార్డు కౌన్సిలర్ మేడపాటి సరిత, నల్లజర్ల మండలం తెలికిచర్లకు చెందిన ఎంపిటిసి సభ్యులు తాడిపర్తి మంగ ఓటు హక్కు వినియోగించుకోలేదు. మొత్తం ఎన్నికల ప్రక్రియను రాజమండ్రి జిల్లా కలెక్టర్ మాధవీలత ప్రత్యక్షంగా పర్యవేక్షించారు.

ప్రశాంతంగా ఎంఎల్‌సి పోలింగ్

ఏలూరులో బారులు తీరిన ఓటర్లు

98.46 శాతం ఓటింగ్ నమోదు
1,105 ఓట్లకుగాను పోలైనవి 1,088
ఓటు హక్కు వినియోగించుకున్న 15 మంది ఎంఎల్‌ఎలు
ఓటు వేయని నరసాపురం ఎంపీ రఘురామకృష్ణంరాజు
ఓటర్ల తరలింపుపై అధికార పార్టీ ఎంఎల్‌ఎలు ప్రత్యేక శ్రద్ధ
భారీ బందోబస్తు నడుమ

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా స్థానిక సంస్థల ఎంఎల్‌సి ఎన్నికల పోలింగ్ సోమవారం ప్రశాంతంగా ముగిసింది. పోలింగ్ ముగిసే సమయానికి మొత్తం 98.46 శాతం ఓటింగ్ నమోదైంది. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో మొత్తం 1,105 మంది స్థానిక ప్రజాప్రతినిధులు ఓటర్లుగా ఉండగా 1,088 మంది తమ ఓటుహక్కును వినియోగించుకున్నారు. వీరిలో పురుషులు 496 మంది ఉండగా 592 మంది మహిళలు ఉన్నారు. ఏలూరు ఎంపిడిఒ కార్యాలయంలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రంలో 249 మంది ఓటర్లకుగాను 246 మంది (98.80 శాతం) తమ ఓటుహక్కు వినియోగించుకోగా వారిలో 108 మంది పురుషులు, 138 మంది మహిళలు ఉన్నారు. జంగారెడ్డిగూడెం ఎంపిడిఒ కార్యాలయంలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రంలో 184 మంది ఓటర్లకుగాను 180 మంది (97.83 శాతం) తమ ఓటుహక్కును వినియోగించుకోగా వారిలో 84 మంది పురుషులు, 96 మంది మహిళలు ఉన్నారు. కొవ్వూరు ఎంపిడిఒ కార్యాలయంలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రంలో 242 మంది ఓటర్లకుగాను 240 మంది (99.17 శాతం) తమ ఓటుహక్కును వినియోగించుకోగా వారిలో 107 మంది పురుషులు, 133 మంది మహిళలు ఉన్నారు. నర్సాపురం ఎంపిడిఒ కార్యాలయంలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రంలో 229 మంది ఓటర్లకుగాను 227 మంది (99.13 శాతం) తమ ఓటుహక్కును వినియోగించుకోగా వారిలో 103 మంది పురుషులు, 124 మంది మహిళలు ఉన్నారు. భీమవరం ఎంపిడిఒ కార్యాలయంలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రంలో 201 మంది ఓటర్లకుగాను 195 మంది (97.01 శాతం) తమ ఓటుహక్కును వినియోగించుకోగా వారిలో 94 మంది పురుషులు, 101 మంది మహిళలు ఉన్నారు. జిల్లాలో ఏర్పాటు చేసిన ఐదు పోలింగ్ కేంద్రాల్లో సోమవారం ఉదయం ఎనిమిది గంటలకు పోలింగ్ ప్రారంభమై సాయంత్రం నాలుగు గంటల వరకు సాగింది. ఈ పోలింగ్ సరళిని ఎప్పటికప్పుడు ఎన్నికల రిటర్నింగ్ అధికారి, జాయింట్ కలెక్టర్ పి.అరుణ్‌బాబు పర్యవేక్షించారు. ఎక్కడా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా పోలింగ్ ప్రశాంతంగా ముగిసినట్లు ఆయన తెలిపారు. ఏలూరు జిల్లా పరిధిలో పోలింగ్ కేంద్రాలను కలెక్టర్ ప్రసన్న వెంకటేష్, ఎస్‌పి రాహుల్‌దేవ్‌శర్మ, పశ్చిమగోదావరి జిల్లా పరిధిలోని పోలింగ్ కేంద్రాలను కలెక్టర్ ప్రశాంతి, ఎస్‌పి యు.రవిప్రకాష్ పరిశీలించారు.

ఓటర్లను పోలింగ్ కేంద్రాలకు తీసుకొచ్చిన ఎంఎల్‌ఎలు

తమ నియోజకవర్గాల పరిధిలోని ఓటర్లను అధికార పార్టీ ఎంఎల్‌ఎలంతా దగ్గరుండి మరీ పోలింగ్ కేంద్రాలకు తీసుకొచ్చారు. వారితోపాటు ఎంఎల్‌ఎలు ఓటేసి వెళ్లారు. ఏలూరు పోలింగ్ కేంద్రంలో మాజీ మంత్రి, ఏలూరు ఎంఎల్‌ఎ ఆళ్ల నాని, ఎంఎల్‌ఎలు అబ్బాయిచౌదరి (దెందులూరు), పుప్పాల వాసుబాబు (ఉంగుటూరు), జంగారెడ్డిగూడెంలోని పోలింగ్ కేంద్రంలో ఏలూరు ఎంపీ కోటగిరి శ్రీధర్, ఎంఎల్‌ఎలు తెల్లం బాలరాజు (పోలవరం), ఎలిజా (చింతలపూడి) ఓటు వేశారు. కొవ్వూరు పోలింగ్ కేంద్రంలో మంత్రి తానేటి వనిత, ఎంఎల్‌ఎలు శ్రీనివాసులు నాయుడు (నిడదవోలు), తలారి శ్రీను (గోపాలపురం) ఓటేయగా భీమవరంలో శాసన మండలి ఛైర్మన్ కొయ్యే మోషేన్‌రాజు, డిప్యూటీ సిఎం కొట్టు సత్యనారాయణ, ఎంఎల్‌ఎలు గ్రంధి శ్రీనివాస్ (భీమవరం, మంతెన రామరాజు (ఉండి), నరసాపురంలో మంత్రి కారుమూరి నాగేశ్వరరావు, జెడ్‌పి ఛైర్మన్ కవురు శ్రీనివాస్, ప్రభుత్వ చీఫ్ విప్ ముదునూరి ప్రసాద్‌రాజు, ఎంఎల్‌ఎలు నిమ్మల రామానాయుడు (పాలకొల్లు), చెరుకువాడ రంగనాథరాజు (ఆచంట), ఎంఎల్‌సి అంగర రామ్మోహన్‌రావు తమ ఓటుహక్కును వినియోగించుకున్నారు. నరసాపురం ఎంపీ కనుమూరి రఘురామకృష్ణంరాజు, ఎంఎల్‌సి పాందువ్వ శ్రీను ఓటు వేయలేదు.

ఓట్ల చీలికపై తర్జనభర్జనలు

స్థానిక సంస్థల ఎంఎల్‌సి ఎన్నికల్లో మొత్తం 1,105 ఓట్లుకుగాను 888 ఓట్లు వరకూ వైసిపికి ఉన్నాయి. 217 ఓటర్లు ప్రతిపక్షాలకు చెందినవారు ఉన్నారు. వైసిపికి రెండు ఎంఎల్‌సి స్థానాలు ఏకగ్రీవంగా కావాల్సి ఉండగా టిడిపి మద్దతుతో స్వతంత్ర అభ్యర్థులు బరిలో నిలవడంతో ఎన్నిక అనివార్యమైంది. ఓట్లు చీలే అవకాశం ఉండటంతో అధికారపార్టీ తమ స్థానిక ప్రజాప్రతినిధులకు సైతం ఓటుకు రూ.20 వేలు, కొవ్వూరు నియోజకవర్గంలో వెండి, సెల్‌ఫోన్లు వంటివిసైతం పంపిణీ చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. అంతేకాకుండా ప్రతిపక్ష పార్టీల ఓటర్లను సైతం ప్రలోభపెట్టి ఓటు వేయించే ప్రయత్నాలు జరిగినట్లు సమాచారం. ఇన్ని చర్యలు తీసుకున్నప్పటికీ ఓట్ల చీలికపై ఇంకా వైసిపిలో అనుమానాలు నెలకొన్నాయి. రెండో ప్రాధాన్యత ఓటు పక్కాగా వైసిపి అభ్యర్థులకు పడిందా లేక టిడిపి మద్దతుదారులకు వేశారా అనే చర్చ వైసిపిలో నడుస్తోంది.

మధ్యాహ్నానికి దాదాపు పోలింగ్ పూర్తి

ఉదయం ఎనిమిది గంటలకు ఎంఎల్‌సి ఎన్నికల పోలింగ్ ప్రారంభమై సాయంత్రం నాలుగు గంటల వరకూ సాగింది. మధ్యాహ్నం సమయానికే దాదాపు పోలింగ్ ప్రక్రియ పూర్తయ్యింది. ఆ తర్వాత ఒకరిద్దరు ఓటర్లు మాత్రమే పోలింగ్ కేంద్రాలకు వచ్చారు. పోలింగ్ కేంద్రాల్లోకి సెల్‌ఫోన్లు అనుమతించలేదు. ఓటు హక్కు వినియోగించుకున్న వారికి సిరా మార్క్ వేయలేదు. స్థానిక సంస్థల ఎంఎల్‌సి ఎన్నికల్లో సిరా మార్క్ వేసే నిబంధన లేదని అధికారులు తెలిపారు.

పోలింగ్ కేంద్రాల వారీగా పోలైన ఓట్లు

పోలింగ్ కేంద్రం	మొత్తం ఓట్లు	పోలైన ఓట్లు	పోల్ కానివి	ఓటింగ్‌శాతం
జంగారెడ్డిగూడెం	184	180	4	97.83
కొవ్వూరు	242	240	2	99.17
నరసాపురం	229	227	2	99.13
ఏలూరు	249	246	3	98.80
భీమవరం	201	195	6	97.01

బ్యాలెట్ బాక్సులు ఏలూరు ఎంపిడిఒ కార్యాలయానికి తరలింపు

జిల్లాలోని ఐదు పోలింగ్ కేంద్రాల్లోని బ్యాలెట్ బాక్సులను ఏలూరు ఎంపిడిఒ కార్యాలయంలో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూమ్‌కు అధికారులు తరలించారు. ఈ నెల 16న కౌంటింగ్ జరగనుంది. అందుకు సంబంధించిన ఏర్పాట్లపై అధికారులు దృష్టి సారించారు.

ఓటు వేస్తున్న ఎంఎల్ఏ ఆళ్ల నాని



అబ్బయ్య చౌదరి

పుప్పాల వాసుబాబు

మేయర్ షేక్ నూర్జహాన్ పెదబాబు



పోలింగ్ కేంద్రం వద్ద ఎంఎల్‌ఎ బాలరాజు

విజయం ఖాయం

ఎంఎల్‌సి అభ్యర్థి వంక రవీంద్రనాథ్

ముఖ్యమంత్రి పరిపాలన, అందిస్తున్న సంక్షేమ పథకాలు, స్థానిక ఎంఎల్‌ఎల కృషి ఫలితంగా మా విజయం ఖాయం.

నమ్మించి మోసగించారు

ఎంఎల్‌సి అభ్యర్థి కవురు శ్రీనివాస్

2014-2019 మధ్య జరిగిన ఎంఎల్‌సి ఎన్నికల్లో వైసిపికి చెందిన ఇద్దరు అభ్యర్థులు నామినేషన్ దాఖలు చేశారు. అయితే అప్పట్లో టిడిపి పెద్దలు ఏకగ్రీవ ఎన్నికకు సహకరించాలని కోరడం, మాకు ఎలా బలం లేదని మా అభ్యర్థులను పోటీ నుంచి తప్పించాం. ప్రస్తుతం వైసిపి నుంచి నాతోపాటు వంక రవీంద్రనాథ్ పోటీలో ఉండగా గత ఎన్నికల మాదిరిగానే ఈసారి తమకు సహకరించాలని తమ పార్టీ పెద్దలు స్వతంత్ర అభ్యర్థులకు మద్దతు పలికిన పార్టీ పెద్దలతో మాట్లాడారు. నామినేషన్లు విత్‌డ్రా చేయిస్తామని చెప్పిన వారు చివరి వరకూ చేస్తున్నామంటూ చెప్పి మోసగించారు. ఇది చూసి ఆ పార్టీ ఓటర్లే మాకు అనుకూలంగా ఓటు వేస్తున్నారు. అందరి సహకారంతో మేం విజయం సాధించబోతున్నాం.

జంగారెడ్డిగూడెంలో ఓటింగ్‌కు నలుగురు దూరం

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో స్థానిక సంస్థల నియోజకవర్గ ఎంఎల్‌సి ఎన్నికల పోలింగ్ సోమవారం ప్రశాంతంగా ముగిసింది. సోమవారం ఉదయం 8:13 గంటలకు ప్రారంభమైన పోలింగ్ మధ్యాహ్నం ఒంటి గంటకు 180 మంది తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు. 97.83 పోలింగ్ నమోదైంది. ఎఎస్‌పి ఎన్.నాగేశ్వరరావు ఆధ్వర్యంలో డిఎస్‌పి కెవి సత్యనారాయణ పోలీసు బందోబస్తును పర్యవేక్షించారు. ఆర్‌డిఒ ఝాన్సీరాణి పోలింగ్ కేంద్రాన్ని ఎప్పటికప్పుడు పర్యవేక్షించారు. ఉదయం 8:15 గంటలకు జంగారెడ్డిగూడెం 19వ వార్డు కౌన్సిలర్ డి.ఇందిరాప్రియదర్శిని మొదటి ఓటుతో పోలింగ్ ప్రారంభమైంది. ఆనంతరం పోలవరం, చింతలపూడి నియోజకర్గాల నుండి ఎంపిటిసిలు, జెడ్‌పిటిసిలు తరలొచ్చి తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఉదయం 10 గంటలకు 27 ఓట్లు, 11 గంటలకు 91, మధ్యాహ్నం 12 గంటలకు 174, ఒంటి గంటకు 180 ఓట్లు పోలయ్యాయి. ఎన్నికల పరిశీలకులు జెసి అపూర్వభరత్, ఏలూరు జిల్లా ఎస్‌పి రాహుల్‌దేవ్‌శర్మ పోలింగ్ కేంద్రాన్ని పరిశీలించారు. పోలవరం, చింతలపూడి ఎంఎల్‌ఎలు తెల్లం బాలరాజు, ఉన్నమట్ల ఎలిజా, ఎంపీ కోటగిరి శ్రీధర్, జంగారెడ్డిగూడెం మున్సిపల్ ఛైర్‌పర్సన్ బత్తిన నాగలక్ష్మి ఓటు హక్కు వినియోగించుకున్నారు.

ఎన్నికలు బహిష్కరించిన నలుగురు ఎంపిటిసిలు

జంగారెడ్డిగూడెం కేంద్రంలో నిర్వహించిన పోలింగ్‌ను నలుగురు ఎంపిటిసిలు బహిష్కరించారు. సిపిఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీకి చెందిన వేలేరుపాడు మండలం రామవరం ఎంపిటిసి సోయం చంద్రరావు, మెడేపల్లికి చెందిన తుర్రం తమ్మయ్య, బుట్టాయిగూడెం మండలం అంతర్వేదిగూడెం ఎంపిటిసి కొవ్వాసి గోవిందరాజు, పిఆర్‌గూడెం ఎంపిటిసి మడకం వెంకటలక్ష్మి ఎన్నికలు బహిష్కరించారు.

టిడిపి కుతంత్రం వల్లే ఈ ఎన్నికలు

ఎంఎల్‌ఎ తెల్లం బాలరాజు

టిడిపి కుతంత్ర రాజకీయాల వల్ల ఎంఎల్‌సి ఎన్నికలు జరుగుతున్నాయని పోలవరం ఎంఎల్‌ఎ తెల్లం బాలరాజు విమర్శించారు. సోమవారం స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో ఓటేసిన ఆయన విలేకరులతో మాట్లాడుతూ జిల్లాలో 1105 మందికి 950 మందికిపైగా వైసిపి ఓటర్లున్నారన్నారు. ఎంఎల్‌సి ఎన్నికల్లో వైసిపి గెలుపు ఖాయమని తెలిసినప్పటికీ చంద్రబాబు కుటిల రాజకీయాలతో స్వతంత్ర అభ్యర్థులను బరిలోకి దించి ఎన్నికలు నిర్వహించేలా చేశారన్నారు. ఇటువంటి రాజకీయాల వల్ల ప్రభుత్వ సమయం, ప్రజాధనం వృథా అవుతుందన్నారు. ఆయన వెంట టి.నరసాపురం జెడ్‌పిటిసి సూరిబాబు ఉన్నారు.

ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేయడం తగదు

చింతలపూడి ఎంఎల్‌ఎ ఎలిజా

వైసిపి గెలుపు ఖాయమని ముందే తెలిసినప్పటికీ ఎన్నికలు నిర్వహించే కుట్రతో ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేయడం టిడిపి అధినేత చంద్రబాబుకు తగదని చింతలపూడి ఎంఎల్‌ఎ ఉన్నమట్ల ఎలిజా అన్నారు. సోమవారం స్థానిక ఎంపిడిఒ కార్యాలయం పోలింగ్ కేంద్రం వద్ద ఓటుహక్కు వినియోగించుకున్న అనంతరం మీడియాతో మాట్లాడారు. ఇలాంటి రాజకీయాలు చేస్తే వచ్చే ఎన్నికల్లో ఇప్పుడున్న స్థానాలు కూడా టిడిపికి దక్కవని వ్యాఖ్యానించారు. ఆయన వెంట జెడ్‌పిటిసి పోల్నాటి బాబ్జి, కౌన్సిలర్ పిపిఎన్.చంద్రరావు ఉన్నారు.

చంద్రబాబుకు చిత్తశుద్ధి లేదు

ఏలూరు ఎంపీ కోటగిరి శ్రీధర్‌బాబు

టిడిపి అధినేత చంద్రబాబుకు రాజకీయ చిత్తశుద్ధి లేదని ఏలూరు ఎంపీ కోటగిరి శ్రీధర్‌బాబు అన్నారు. సోమవారం స్థానిక ఎంపిడిఒ కార్యాలయం వద్ద ఓటు వేసిన అనంతరం విలేకరులతో మాట్లాడుతూ వైసిపిపై గెలిచే అవకాశం లేదని తెలిసినప్పటికీ చంద్రబాబు కుటిల రాజకీయాలకు పాల్పడ్డారన్నారు. చిత్తశుద్ధి ఉంటే టిడిపి మ్యాండెట్‌పై పోటీకి దిగేవారని వ్యాఖ్యానించారు. నీచ రాజకీయాలు చేస్తే ప్రజల మెప్పు పొందలేరన్నారు.

అగ్గిపుల్లపై అద్భుతం

ప్రజాశక్తి - ఏలూరు టౌన్



రెండున్నర దశాబ్దాలుగా సూక్ష్మ కళలో అద్భుత నైపుణ్యం కనబరుస్తూ ఏలూరు నగర కీర్తిని రాష్ట్రవ్యాప్తంగా విస్తరిస్తున్నారు ప్రముఖ కళాకారుడు మేతర సురేష్. ఇప్పటికే ఇండియన్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో స్థానం పొందిన ఆయన గిన్నిస్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో స్థానం సాధించడమే తన జీవిత లక్ష్యమని పేర్కొన్నారు. అజాదీ కా అమృత్ మహోత్సవంలో భాగంగా దేశానికి స్వాతంత్ర్యం సిద్ధించి 75 ఏళ్లు కావస్తున్న సందర్భాన్ని పురస్కరించుకుని సూది మొనలో జాతీయ పతాకాన్ని నిర్మించి ఔరా అనిపించిన ఆయన ఇప్పుడు ప్రపంచవ్యాప్తంగా సంచలనాలు సృష్టిస్తూ.. గ్లోబల్ అవార్డుతో పాటు, ఆస్కార్ అందుకున్న తొలి తెలుగు సినిమా త్రిబుల్ ఆర్ స్ఫురిస్తూ ప్రముఖ హీరోలు రామ్ చరణ్, జూనియర్ ఎన్‌టిఆర్ చిత్రాలను అగ్గి పుల్లపై చెక్కి మరోమారు భారతీయ అభిమానాన్ని చాటుకున్నారు.

కారు ఢీకొని ధాన్యం కమీషన్ వ్యాపారి మృతి

ప్రజాశక్తి - భీమడోలు



కోటేశ్వరరావు (ఫైల్‌ఫొటో)

మండలంలోని పూళ్ల సమీపంలో కోడూరుపాడు రైల్వే గేటు వద్ద 216 జాతీయ రహదారిపై సోమవారం రాత్రి చోటు చేసుకున్న రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పూళ్ల గ్రామానికి చెందిన సున్న కోటేశ్వరరావు (53) ధాన్యం కమీషన్ వ్యాపారి. ఆయన కోడూరుపాడు నుంచి పూళ్ల బైక్‌పై వస్తుండగా తాడేపల్లిగూడెం నుంచి ఏలూరు వైపు వెళ్తున్న కారు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో కోటేశ్వరరావు అక్కడికక్కడే మృతి చెందారు. మృతునికి భార్య, ఇద్దరు పిల్లలున్నారు. భీమడోలు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఆర్‌ఆర్‌ఆర్‌కు ఆస్కార్ అవార్డు పట్ల హర్షం

ప్రజాశక్తి - పోలవరం

రాజమౌళి తెరకెక్కించిన ఆర్‌ఆర్‌ఆర్ చిత్రంలో నాటు నాటు పాటకు ఆస్కార్ అవార్డు రావడం పట్ల పోలవరం గ్రామంలో పలువురు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా గ్రామానికి చెందిన సున్నం సుధీర్ రాజు మాట్లాడుతూ తెలుగు సినీచరిత్రలో ఆస్కార్ అవార్డు రావడం తెలుగు వారందరూ గర్వించదగ్గ విషయమన్నారు. ఈ పాట రచయితకు, నృత్య దర్శకులకు, టెక్నీషియన్లకు, నటించిన రామ్ చరణ్‌కు, జూనియర్ ఎన్‌టిఆర్‌కు శుభాకాంక్షలు తెలిపారు.

నేడు జాతీయ నులి పురుగుల నిర్మూలన కార్యక్రమం

1 నుంచి 19 ఏళ్ల వారికి అల్బెండజోల్ మాత్రల పంపిణీ

ప్రజాశక్తి - ఏలూరు

ప్రతి చిన్నారికి నులి పురుగుల నివారణకు అల్బెండజోల్ మాత్రను తప్పక వేయించాలని కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ సూచించారు. ఈ నెల 14వ తేదీన నిర్వహించే జిల్లాస్థాయి నులిపురుగుల నిర్మూలన కార్యక్రమ నిర్వహణ ఏర్పాట్లపై డిఎంహెచ్‌ఒ డాక్టర్ డి.ఆశ, ఆర్‌బిఎస్‌కె జిల్లా కో-ఆర్డినేటర్ డాక్టర్ సిహెచ్.మానస తదితరులతో కలెక్టర్ సమీక్షించారు. జిల్లాలో 4,06,025 మంది పిల్లలకు మాత్రలు పంపిణీ చేయనున్నారు. ప్రతీ అంగన్‌వాడీ సెంటర్, ప్రభుత్వ, ప్రయివేటు స్కూల్స్, కాలేజీలు విద్యార్థులు, స్కూల్‌కి వెళ్లని 1-19 సంవత్సరాల పిల్లలను గుర్తించి, వారందరికీ అల్బెండజోల్ మాత్రలు ఇచ్చి మాత్రను చప్పరించి మింగేలా ప్రత్యేకచొరవ తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమాన్ని సంబందిత శాఖల సమన్వయంతో విజయవంతం చేయాలని సూచించారు. ఈ మాత్రలు ఎంపిడిఒలకు పిహెచ్‌సిల నుండి సరఫరా చేస్తామన్నారు. ఎంపిడిఒ నుండి సంబంధిత ప్రభుత్వ, ప్రయివేటు స్కూళ్లకు, అంగన్వాడీ సెంటర్లకు, కళాశాలలకు పంపిణీ చేశామన్నారు. విద్యార్థులు నూరు శాతం పాఠశాలలకు హాజరై ఈ మాత్రలు తీసుకునేలా వారి తల్లిదండ్రులు చొరవ తీసుకోవాలని సూచించారు, 14వ తేదీన ఏ కారణం చేతనైనా స్కూల్స్‌కి రాని పిల్లలను గుర్తించి వారందరూ ఈ మాత్రలు వేసుకునేలా ప్రోత్సహించాలని ఐసిడిఎస్ అధికారులను ఆదేశించారు. పిల్లల్లో నులి పురుగులుంటే పోషకాహార లోపం, రక్త హీనత వచ్చి నీరసంగా ఉంటారని, అదే విధంగా శారీరక, మానసిక లోపాలు కలిగి ఉంటారన్నారు. ఈ దృష్ట్యా ఎంతో సురక్షితమైన మాత్రను డోస్ ఒకటో సంవత్సరం నుంచి రెండేళ్లలోపు వారికి సగం మాత్ర, 2-19 సంవత్సరాల వారికి 400ఎమ్‌జి ఒక మాత్ర వేయాలన్నారు. 1-2 సంవత్సరాలలోపు పిల్లలకు సగం మాత్ర పొడిచేసి ఇవ్వాలని, 2-19 సంవత్సరాల వయస్సు గల వారికి పూర్తిమాత్ర చప్పరించి మింగేలా చూడాలన్నారు. ఈ కార్యక్రమాన్ని మధ్యాహ్న భోజనం అనంతరం నిర్వహించాలని, ముందుగా చేతులు శుభ్రపరచే కార్యక్రమం నిర్వహించాలన్నారు. మాత్ర చప్పరించిన అనంతరం ఏదైనా ప్రతికూల పరిస్థితులు జరిగితే హెల్త్ స్టాఫ్ దగ్గర తగిన మందులు, పిహెచ్‌సిల్లో వైద్యుల అందుబాటులో ఉంటారన్నారు. ఈ నెల 14వ తేదీన మాత్ర స్వీకరించని వారికి 18వ తేదీన మాప్ అప్ రౌండులో ఇవ్వాలన్నారు.

సినీఫక్కీలో చోరీ

దొరికిపోయిన నిందితులు

ప్రజాశక్తి - జీలుగుమిల్లి

వివరాలు వెల్లడిస్తున్న పోలీసులు

కూరగాయల వ్యాపారి వద్ద పని చేస్తూ, ఆ వ్యాపారినే మోసం చేయాలని చూసిన గుమస్తా చివరకు పోలీసులకు చిక్కాడు. ఇటు పోలీసులను, అటు వ్యాపారిని ముప్పుతిప్పలు పెట్టిన ఈ కేసును పోలీసులు ఎట్టకేలకు ఛేదించారు. సిఐ బి.వెంకటేశ్వరావు తెలిపిన వివరాల ప్రకారం జంగారెడ్డిగూడేనికి చెందిన విజయ గణపతి ట్రేడర్స్‌కు చెందిన శివశంకర్ తెలంగాణలోని పలుప్రాంతాల్లో కూరగాయల వ్యాపారం చేస్తున్నాడు. ప్రతీవారం కూరగాయలు పంపి డబ్బు వసూలుకు గుమస్తాలను పంపేవాడు. దానిలోభాగంగా గుమస్తాగా పనిచేస్తున్న దుర్గారావును, మరో వ్యక్తి రాజశేఖర్‌ను డబ్బు వసూలుకు పంపాడు. వారు వ్యాపారుల నుంచి లక్షా 20 వేలు వసూలు చేసుకుని మోటార్ సైకిల్‌పై తిరిగి వస్తున్నారు. ఈ తరుణంలో దుర్గారావు అత్యాశకు పోయి డబ్బు కాజేయాలని పథకం రచించాడు. శవశంకర్ వద్ద గుమస్తాగా చేస్తూ మానేసిన దుర్గారావు మిత్రుడు రోహిత్, అతని మిత్రులు మల్లాది సునీల్, మన్యాం అరవింద్ సహాయంతో మండలంలోని రమణక్కపేట సమీపంలో కారులో వచ్చి పోలీసులమని చెప్పి తుపాకీతో బెదిరించి వారి వద్ద ఉన్న నగదు లాక్కొని పరారయ్యేలా ఏర్పాట్లు చేశాడు. అనుకున్నట్లే వారు కారులో వచ్చి నగదుతో పరారయ్యారు. దీంతో ద్విచక్ర వాహనంపై ఉన్న వేరే వ్యక్తి రాజశేఖర్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. అనంతరం యజమానికి సమాచారం అందించాడు. ఈ తరుణంలో సోమవారం పాలాచర్ల, రాజవరం సమీపంలో పోలీసులు వాహన తనిఖీలు చేస్తుండగా అనుమానాస్పదంగా వెళ్తున్న కారును ఆపి తనిఖీ చేస్తున్న సమయంలో నిందితులు పట్టుబడ్డారు. వారి వద్దనుంచి మహీంద్ర కారును, బొమ్మ తుపాకీ, ద్విచక్ర వాహనం, లక్షా ఇరవై వేల నగదును స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. నలుగురు వ్యక్తులతో సహా స్వాధీన సొత్తును కోర్టులో హాజరు పరచనునట్లు తెలిపారు.

అనుమతుల్లేని ఆక్వా చెరువులను ధ్వంసం చేయాలి

ప్రజాశక్తి - ముదినేపల్లి

ప్రభుత్వ అనుమతులు లేకుండా ఊటుకూరు గ్రామ రెవెన్యూ పరిధిలో తవ్విన ఆక్వా చెరువులను వెంటనే ధ్వంసం చేయాలని ఆ గ్రామస్తులు సోమవారం సచివాలయంలో జరిగిన స్పందన కార్యక్రమంలో వినతిని అందచేశారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ కొందరు అధికార పార్టీ నాయకులు ప్రభుత్వాధికారుల అండదండలతో ఆక్వా చెరువులు తవ్వి పంట భూములను, తాగునీటి చెరువులను కలుషితం చేస్తున్నారన్నారు. దేవపూడికి చెందిన అధికార పార్టీకి చెందిన కొందరు ఊటుకూరులో అక్రమంగా చెరువులు తవ్వి ఆక్వా సాగు చేస్తున్నట్లు తెలిపారు. ఆక్వా సాగు చేసే చెరువులకు మురుగు బోదెల సౌకర్యం లేకపోవడంతో ఆయా చెరువుల్లోని నీటిని పంట కాల్వలోకి వదలడంతో ఆ నీరు తాగునీటి చెరువులోకి చేరి కలుషితమవుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. దీంతో గ్రామస్తులు మినరల్ వాటర్ కొనుగోలు చేసి తాగుతున్నట్లు తెలిపారు. కాలువల్లోని కలుషిత నీరు తాగిన పాడి పశువులు వివిధ రోగాలబారిన పడటంతో పాటు పాల దిగుబడులు తగ్గిపోతున్నాయన్నారు. పశువులు కూడా మృత్యువాత పడుతున్నాయన్నారు. దేవపూడి, ఊటుకూరు గ్రామాల్లో చెరువుల తవ్వకాలకు అధికారులు అనుమతులు ఇవ్వరాదన్నారు. అలాగే అనధికారికంగా తవ్విన ఐదు చెరువులను ధ్వంసం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో దేవపూడికి చెందిన కౌలురైతు సంఘం జిల్లా కమిటీ సభ్యులు ఉల్లంకి నాంచారయ్య, ఊటుకూరు గ్రామస్తులు కుర్మా రాజప్రకాష్, కె.గోపి, ముత్యాల రామచంద్రమూర్తి, పి.నాగరాజు పాల్గొన్నారు.



వినతిని అందిస్తున్న రైతులు


రేషన్ లబ్ధిదారులతో మాట్లాడుతున్న తహశీల్దార్, ఎస్ఐ

రేషన్ బియ్యం సక్రమంగా అందడం లేదని ఆందోళన

ప్రజాశక్తి - టి.నరసాపురం

రేషన్ బియ్యం సక్రమంగా అందడంలేదని మండలంలోని బొర్రంపాలెంలో షాపు నెంబర్ 24 పరిధిలోని లబ్దిదారులు సోమవారం రేషన్ వ్యాన్‌ను అడ్డుకుని ఆందోళన చేపట్టారు. దీంతో విషయం తెలుసుకున్న తహశీల్దార్ జెవి.సుబ్బారావు, ఎస్ఐ సతీష్‌కుమార్ సంఘటనా స్థలానికి చేరుకుని లబ్దిదారులతో చర్చించారు. ప్రతినెలా అందాల్సిన రేషన్ సక్రమంగా అందడంలేదని, కొందరికి రెండు మూడు నెలలుగా అందడంలేదని, రెండు రోజుల్లో పంపిణీ ముగుస్తుండగా తమ నెల కూడా అందడంలేదని లబ్దిదారులు ఆందోళన వ్యక్తం చేశారు. ఈ విషయాలను తహశీల్దార్ దృష్టికి తీసుకెళ్లడంతో సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని ఆయన హామీ ఇచ్చారు. కొంతమందికి వెంటనే దగ్గరుండి పంపిణీ చేయించారు. మిగిలిన వారికి రెండు రోజుల్లో పూర్తి స్థాయిలో అందరికీ అందిస్తామని తెలిపారు.

అగ్ని ప్రమాద బాధితులకు సాయం

ప్రజాశక్తి - పోలవరం

మండలంలోని జిల్లెళ్లగూడెం పంచాయతీ పేద్దాలలో శుక్రవారం సంభవించిన అగ్నిప్రమాదంలో ఇల్లు దగ్ధమైన నిర్వాసితుడు శ్రీనివాసరావు కుటుంబాన్ని టిడిపి మండల అధ్యక్షులు బొడ్డు కృష్ణ ఆధ్వర్యంలో ఆ పార్టీ మండల నాయకులు సోమవారం పరామర్శించారు. ఈ సందర్భంగా బాధిత కుటుంబానికి రూ.ఎనిమిది వేల నగదు, నిత్యావసరాలు, దుస్తులు అందించారు. ఈ కార్యక్రమంలో పోలవరం టౌన్ పార్టీ అధ్యక్షులు పోతుల శ్రీనివాసరావు, ఎస్‌సి సెల్ నియోజకవర్గ నాయకులు యడ్ల వినోద్, జిల్లెళ్లగూడెం గ్రామ కమిటీ అధ్యక్షులు జూల గంగరాజు, ఎల్లంపేట గ్రామ కమిటీ అధ్యక్షులు ఇళ్ల సత్యనారాయణ, తొర్లపాటి యేసేబు, సవలం శ్రీను, చిక్కాల వెంకటేశులు, టిడిపి ఏలూరు పార్లమెంట్ అధికార ప్రతినిధి జల్లేపల్లి శేషవెంకటజితేంద్ర పాల్గొన్నారు.

వికలాంగునికి ట్రై సైకిల్

ప్రజాశక్తి - చాట్రాయి

మండల కేంద్రమైన చాట్రాయి గ్రామంలో ఎస్‌సి కాలనీకి చెందిన బూరుగు బాలరాజు పుట్టుకతోనే రెండు కాళ్లు పని చేయకుండా అంగవైకల్యంగా జన్మించాడు. అతను కనీస అవసరాలు తీర్చుకోవడానికి కూడా నడవలేని స్థితిలో ఉండగా ఎస్‌సి సెల్ చింతలపూడి నియోజకవర్గ అధ్యక్షుడు పల్లి శ్రీను సోమవారం బూరుగు బాలరాజు గృహానికి వెళ్లి బొప్పన రాధమ్మ ఫౌండేషన్ సహాయంతో ట్రై సైకిల్ పంపిణీ చేశారు. వికలాంగులు చైతన్య, తంబి, మోహన్ సహకారంతో ట్రై సైకిల్ ఇచ్చినట్లు బాలరాజు తెలిపారు. ఈ కార్యక్రమంలో తాతా సోంబాబు, నందేటి మురళీమోహన్ పాల్గొన్నారు.

తాగునీటి సమస్య లేకుండా చూడండి

కైకలూరు:గ్రామాల్లో తాగునీటి సమస్య లేకుండా అధికారులు, ప్రజాప్రతినిధులు చర్యలు తీసుకోవాలని ఎంపిఎ దూలం నాగేశ్వరరావు తెలిపారు. స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో సోమవారం ఎంపిపి అడవి కృష్ణమోహన్ అధ్యక్షత సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో తాగునీటి చెరువులు పూర్తిగా నిండేలా చర్యలు తీసుకోవాలన్నారు. గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో గుర్తించిన సమస్యలకు ప్రభుత్వం రూ.4.50 కోట్ల నిధులు మంజూరు చేసిందని, అధికారులు ఆయా గ్రామాల్లోని సమస్యలను గుర్తించి మార్చి నెలాఖరుకు పనులు పూర్తి చేయాలన్నారు. ఎంపిపి మాట్లాడుతూ గ్రామాల్లో జరిగే కార్యక్రమాలకు ప్రజాప్రతినిధులను ఆహ్వానించాలని సూచించారు. సమావేశంలో పలు అంశాలపై అధికారులు సమీక్షించారు. ఈ కార్యక్రమంలో వైస్ఎంపిపి మహ్మద్ జహీర్, ఎంపిడిఒ రామలింగేశ్వరావు, కైకలూరు సర్పంచి నవరత్న కుమారి, సర్పంచుల ఫోరం అధ్యక్షులు బలరామరాజు, శివాజీ పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అవగాహనుండాలి

జంగారెడ్డిగూడెం:సైబర్ నేరాలు, దిశ చట్టం, లోన్ యాప్స్, ఆన్ లైన్ మోసాలపై విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలని సిఎస్‌టిఎస్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎన్.ప్రసాద్‌బాబు విద్యార్థులకు సూచించారు. సోమవారం స్థానిక సిఎస్‌టిఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు దిశ చట్టం, లోన్ యాప్స్ మోసాలు, సైబర్ నేరాల గురించి కళాశాల ఆంగ్లశాఖ, జంగారెడ్డిగూడెం సచివాలయ సిబ్బంది సంయుక్త ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎన్.ప్రసాద్‌బాబు మాట్లాడుతూ నేటి యువత చెడు వ్యసనాలబారిన పడి, చట్టాలపై సరైన అవగాహన రాహిత్యంతో, బంగారు భవిష్యత్‌ను నాశనం చేసుకుంటున్నారన్నారు. దిశాచట్టం కో ఆర్డినేటర్, ఉమెన్ పోలీస్‌ను విధులు నిర్వహిస్తున్న ఆర్ హెచ్ సూర్య దిశ చట్టంపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఆంగ్ల శాఖ అధ్యాపకులు డాక్టర్ జి.శ్రీనివాసరావు, పి.సన్యాసిరావు, డాక్టర్ బదిరీ నారాయణ, వెంకటాచార్యులు పాల్గొన్నారు.

నేరాలు - ఘోరాలు

పొగాకు బ్యారన్ దగ్ధం

రూ.2 లక్షల ఆస్తి నష్టం

టి.నరసాపురం:పొగాకు బ్యారన్ దగ్ధమై రూ.2 లక్షల ఆస్తి నష్టం వాటిల్లినట్లు చింతలపూడి అగ్ని మాపక అధికారి టి.వెంకటేశ్వరరావు తెలిపారు. మండలంలోని రామన్నపాలెంలో సోమవారం చోటు చేసుకున్న ఈ సంఘటనపై ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. తిరుమల దేవిపేట పంచాయతీలోని వందరామన్నపాలెం గ్రామానికి చెందిన బందారు పాపారావుకు చెందిన పొగాకు బ్యారన్‌లో క్యూరింగ్ జరుగుతుండగా ప్రమాదవశాత్తు మంటలు చెలరేగి బ్యారన్‌తో పాటు పొగాకు పూర్తిగా దగ్ధమవుతుండడంతో గుర్తించిన స్థానికులు చింతలపూడి అగ్ని మాపక సిబ్బందికి సమాచారం అందించారు. సంఘటనా స్థలానికి చేరుకున్న అగ్నిమాపక సిబ్బంది మంటలను అదుపు చేశారు. ఈ ప్రమాదంలో రూ.3 లక్షల ఆస్తి నష్టం సంభవించినట్లు అగ్ని మాపక అధికారి టి.వెంకటేశ్వరరావు తెలిపారు.

రైలులో వ్యక్తిపై బ్లేడుతో దాడి

ఏలూరు స్పోర్ట్స్: విజయవాడ నుంచి రాజమహేంద్రవరానికి రైలులో ప్రయాణిస్తున్న వ్యక్తిపై గుర్తు తెలియని వ్యక్తి బ్లేడుతో దాడిచేయడంతో తీవ్రంగా గాయపడిన ఘటన సోమవారం జరిగింది. తోటి ప్రయాణికులు రైల్వే పోలీసులకు సమాచారం ఇవ్వడంతో వారు అప్రమత్తమై బాధితుణ్ని ఏలూరు ఆసుపత్రికి తరలించారు. రైల్వే పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. కాకినాడ జిల్లా పెద్దాపురానికి చెందిన గోలి సత్యనారాయణ విజయవాడ లెనిన్ సెంటర్లోని దేవా హోటల్లో పనిచేస్తున్నాడు. సోమవారం రాజమహేంద్రవరానికి రైలులో బయలుదేరాడు. రైలులో సీటు విషయంలో మరో వ్యక్తితో గొడవ జరిగింది. ఈ క్రమంలో గుర్తుతెలియని వ్యక్తి బ్లేడుతో విచక్షణారహితంగా దాడిచేశారు. రైల్వే పోలీసులకు సమాచారం ఇవ్వడంతో ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం ఆయన ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉంది.

వైద్యం అందక గేదె మృతి

చాట్రాయి:జనార్ధనవరంలో సరైన వైద్యం అందక పాడిగేదె మృత్యువాత పడింది. వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన పాడి రైతు పామర్తి సోమేశ్వరరావుకు చెందిన రూ.75 వేల విలువ చేసే నాలుగు నెల చూడి గేదె ఐదు రోజులుగా అనారోగ్యంతో బాధపడుతుంది. సచివాలయానికి చెందిన పశువైద్యుడు రవితేజ వైద్యం అందిస్తున్నారు. అయితే మండలంలో పశువుల డాక్టర్ లేకపోవడం, ఇన్‌ఛార్జ్ డాక్టర్ సెలవులో ఉండటంతో సరైన వైద్యం చేసేవారు లేకుండాపోయారు. ఈ క్రమంలో గేదె పరిస్థితి విషమించి చనిపోయింది. అత్యవసర పరిస్థితుల్లో ప్రజలు తక్షణ వైద్య సహాయం కోసం ఏర్పాటు చేసిన టోల్ ఫ్రీ నెంబర్ 1962కు సోమేశ్వరరావు ఐదు రోజులుగా ఫోన్ చేస్తున్నా ఉన్నారు. ఎట్టకేలకు ఫోన్ లిఫ్ట్ చేసి సూచనలు చేశారు తప్ప, గేదెను వెటర్నరీ ఏరియా ఆసుపత్రికి తీసుకెళ్లకుండా ఎవరూ రాలేదని ఆవేదన వ్యక్తం చేశారు. పశువైద్య నిర్లక్ష్యం వల్ల గేదె మృతిచెందిందని రైతు వాపోయారు.

ప్రజాశక్తి
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు ఈక్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్కులేషన్ వివరాల కోసం సెల్: 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 83339 88814

ఉపాధ్యాయుల కృషి.. విద్యార్థుల సాధన

పది పరీక్షలకు ప్రత్యేక ప్రణాళికలు

వంద శాతం ఉత్తీర్ణతే లక్ష్యం

ఎన్‌ఆర్‌కెవి.ప్రసాద్, న్యూ జనరేషన్ స్కూల్ డైరెక్టర్, ఏలూరు

కోవిడ్ తర్వాత విద్యార్థులు మానసిక ఒత్తిడిని అధిగమించి నూటికి నూరు శాతం ఉత్తీర్ణత సాధించేలా కృషి చేస్తున్నామని న్యూ జనరేషన్ స్కూల్ డైరెక్టర్ ఎన్‌ఆర్‌కెవి.ప్రసాద్ తెలిపారు. 2023 సంవత్సరం పదో తరగతి విద్యార్థుల కోసం ప్రత్యేక పాఠ్య ప్రణాళిక సిద్ధం చేసి ఉత్తమ ఫలితాలు సాధించేలా న్యూ జనరేషన్ స్కూల్ యాజమాన్యం కృషి చేస్తున్నామని తెలిపారు.

విద్యార్థులకు ప్రత్యేక తరగతులు

జి.సత్యనారాయణ, ఎల్‌ఐసి హైస్కూల్ హెచ్‌ఎం, ఏలూరు

2023 సంవత్సరం పదో తరగతి విద్యార్థులు నూటికి నూరుశాతం ఉత్తీర్ణత సాధించే దిశగా ప్రత్యేక పాఠ్య ప్రణాళిక సిద్ధం చేశామని ఎల్ఐసిబిల్డ్స్ స్కూల్ హెచ్‌ఎం జి.సత్యనారాయణ తెలిపారు. ఈ సంవత్సరం 167 మంది విద్యార్థులు పబ్లిక్ ఎగ్జామ్‌కి హాజరవుతున్నారని చెప్పారు. సబ్జెక్టు వారీగా ప్రశ్నపత్రాలు తయారు చేసి పరీక్షలు నిర్వహించి పబ్లిక్ ఎగ్జామ్‌కు తయారు చేస్తున్నామని తెలిపారు. విద్యార్థులకు మెలకువలు, సూచనలు, సలహాలు అందిస్తున్నామన్నారు. వెనకబడిన విద్యార్థులకు 40 రోజుల నుంచి ప్రత్యేక శిక్షణ ఇస్తున్నామని తెలిపారు.

ఉత్తమ ఫలితాల సాధనకు కృషి

మురళీకృష్ణ, సుబ్బరాజు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు, చింతలపూడి

చింతలపూడి : పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో నూటికి నూరుశాతం ఉత్తీర్ణత శాతం వచ్చేలా మెరుగైన, ఉన్నతమైన విద్య అందిస్తున్నామని ఉపాధ్యాయులతో కలిసి పదో తరగతి పరీక్షలపై చర్చించి, ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు సుబ్బరాజు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు మురళీకృష్ణ తెలిపారు. ప్రతి విద్యార్థిపై వ్యక్తిగత శ్రద్ధ పెట్టి, పదో తరగతి పబ్లిక్ పరీక్షలకు సిద్ధం చేస్తున్నట్లు తెలిపారు. విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

పట్టణంలో ఉన్న సుబ్బరాజు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పబ్లిక్ పరీక్షలకు 85 మంది, తెలుగు మీడియం 29 మంది, ఇంగ్లీష్ మీడియం 56 మంది హాజరవుతున్నారి తెలిపారు.

ఉదయం సాయంత్రం ప్రత్యేక తరగతులు

పాఠశాలలో 85 మంది విద్యార్థులు నూటికి నూరుశాతం ఉత్తీర్ణత సాధించేందుకు ఉదయం, సాయంత్రం ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. తరగతుల్లో వెనుకబడుతున్న విద్యార్థులపై ఉపాధ్యాయులు ప్రత్యేక దృష్టి పెడుతున్నట్లు చెప్పారు.

నలుగురు విద్యార్థులకు ఒక ఉపాధ్యాయులు

పాఠశాలలో పదో తరగతి చదువుతున్న విద్యార్థులకు ఉపాధ్యాయుల పర్యవేక్షణ పెడుతున్నట్లు తెలిపారు. నలుగురు విద్యార్థులకు ఒక ఉపాధ్యాయుడిని పర్యవేక్షణగా పెడుతున్నట్లు చెప్పారు. విద్యార్థులకు ఏ సబ్జెక్టుల్లో సందేహాలు ఉన్నాయో ఉపాధ్యాయులు వాటిపై దృష్టి సారించినట్లు తెలిపారు. చదువుతోపాటు ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని తల్లితండ్రులకు సమావేశాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు సెలవు రోజుల్లో ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

ఆక్రమణల తొలగింపునకు చర్యలు

ప్రజాశక్తి - భీమడోలు

భీమడోలు మండల పరిధిలోని మెట్ట ప్రాంతంలో ఉన్న ఆరు గ్రామాల్లో చెరువుల ఆక్రమణ తొలగింపునకు చర్యలు తీసుకున్నట్లు భీమడోలు తహశీల్దార్ షంషుద్దీన్ తెలిపారు. ఈ కార్యక్రమాన్ని పంచాయతీరాజ్ శాఖ సహకారంతో సంయుక్తంగా చేపడుతున్నామన్నారు. సదరు గ్రామాల్లో ఇటీవల నిర్వహించిన సర్వే సందర్భంగా 126.13 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న పంచాయతీ చెరువులు, 109.41 ఎకరాల విస్తీర్ణంలో 33 సాగు చెరువులు ఆక్రమణలకు గురైనట్లు గుర్తించామన్నారు. వీటిలో 6.12 ఎకరాల విస్తీర్ణంలో 13 ప్రభుత్వ భవనాలు ఉన్నాయన్నారు. 229.42 ఎకరాల విస్తీర్ణంలో 426 ఇతర ఆక్రమణలు ఉన్నాయన్నారు. దీనిలో భాగంగా 8.79 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న ఆక్రమణల్లో 141 నివాస గృహాలు ఉన్నాయన్నారు. మిగిలిన 221.21ఎకరాల విస్తీర్ణంలో 276 మంది ఆక్రమణదారులు సాగు చేస్తున్నారని తెలిపారు. ఆక్రమణ తొలగింపులు ప్రారంభించిన తర్వాత ఇప్పటివరకు పోలసానిపల్లి గ్రామంలో 8.20 ఎకరాల విస్తీర్ణంలో సాగు చేస్తున్న తొమ్మిది మంది ఆక్రమణదారులను తొలగించామన్నారు. మిగిలిన ఆక్రమణల్లో జరుగుతున్న సాగు చివరి దశకు చేరుకున్న నేపథ్యంలో సాగు పూర్తయిన తర్వాత ఆక్రమణదారులను తొలగించేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఇక గ్రామాల వారీగా వస్తే భీమడోలు పంచాయతీ పరిధిలోని 24.08 ఎకరాల విస్తీర్ణం పంచాయతీ చెరువులు ఆక్రమణలకు గురయ్యాయన్నారు. దీనిలో ఐదు ఎకరాల విస్తీర్ణంలో ప్రభుత్వ భవనాలు ఉన్నాయన్నారు. మిగిలిన విస్తీర్ణంలో 16 మంది ఆక్రమణదారులు సాగు చేస్తున్నారని తెలిపారు. సూరప్పగూడెం గ్రామపంచాయతీలో 1.5 ఎకరాలు విస్తీర్ణం గల పంచాయతీ చెరువు, 46.39 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న ఇరిగేషన్ చెరువు ఆక్రమణలకు గురయ్యాయన్నారు. దీనిలో భాగంగా 4.70 ఎకరాల విస్తీర్ణంలో 65 మంది నివాస గృహాలు నిర్మించుకున్నారని, ఇంకా మిగిలిన 65 మంది ఆక్రమణదారులు చెరువు ప్రాంతంలో సాగు చేస్తున్నారని తెలిపారు. అంబర్‌పేట పంచాయతీ పరిధిలో ఉన్న 98.5 ఎకరాలు విస్తీర్ణంలో ఉన్న 12 పంచాయతీ చెరువులు ఆక్రమణలు గురయ్యాయన్నారు. దీనిలో భాగంగా 0.12 ఎకరాల విస్తీర్ణంలో మూడు ప్రభుత్వ భవనాలు ఉన్నాయన్నారు 4.03 ఎకరాల విస్తీర్ణంలో 76 మంది నివాస గృహాలు నిర్మించుకున్నారని 118 ఆక్రమణదారులు 93.9 ఎకరాల విస్తీర్ణంలో సాగు చేస్తున్నారన్నారు. పోలసానిపల్లిలో ఉన్న 2.5 ఎకరాల విస్తీర్ణంలో మూడు పంచాయతీ, 60.12 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న 23 సాగునీటి చెరువులు ఆక్రమణలకు గురయ్యాయన్నారు. దీని లో ఒక ఎకరం విస్తీర్ణంలో ప్రభుత్వ భవనాలు ఉండగా 61.62 ఎకరాల విస్తీర్ణంలో 72 మంది ఆక్రమణదారులు సాగు చేస్తున్నారని తెలిపారు. కోడూరుపాడులో ఉన్న అరఎకరం విస్తీర్ణంలో గల సాగునీటి చెరువు ఒక దానిలో ఆక్రమణదారులు సాగు చేస్తున్నారన్నారు. దుద్దేపూడి గ్రామపంచాయతీ పరిధిలో 2.40 ఎకరాల విస్తీర్ణంలో గల సాగునీటి చెరువు రెండు ఆక్రమణలకు గురయ్యాయన్నారు. వీటిలో 13 మంది సాగు చేస్తున్నారని తెలిపారు. ఇక ఆక్రమ ణ తొలగింపులో భాగంగా పోలసానిపల్లిలో చేపట్టిన కార్యక్రమం చురుకుగా సాగుతుందని భీమడోలు తహశీల్దార్ తెలిపారు.

భీమడోలులో రెండు ఇంటర్ పరీక్షా కేంద్రాలు

ప్రజాశక్తి - భీమడోలు

భీమడోలు మండల పరిధిలో ఈ నెల 15వ తేదీ నుంచి ప్రారంభం కానున్న ఇంటర్ పరీక్షల నిర్వహణకు రెండు పరీక్షా కేంద్రాలను ఇంటర్మీడియట్ బోర్డు ఏర్పాటు చేసిందని భీమడోలు శ్రీ వెంకటేశ్వర జూనియర్ కళాశాల ఇన్‌ఛార్జి ప్రిన్సిపల్ భవానిసింగ్ తెలిపారు. పరీక్షా కేంద్రాలుగా భీమడోలు శ్రీ వెంకటేశ్వర కళాశాల, పోలసానిపల్లిలోని బాలయోగి గురుకులం బాలికల పాఠశాల ఏర్పాటు చేశారన్నారు. భీమడోలు శ్రీ వెంకటేశ్వర జూనియర్ కళాశాలలో ఇంటర్ మొదటి సంవత్సరానికి చెందిన 165 మంది, రెండో సంవత్సరానికి చెందిన 175 మంది హాజరు కానున్నారు. భీమడోలు గీతాంజలి కళాశాలకు చెందిన 35 మంది, పోలసానిపల్లి (బాలికల) గురుకులంకు చెందిన 56 మంది, ద్వారకాతిరుమల శ్రీనివాస కళాశాలకు చెందిన 55 మంది, గుణ్ణంపల్లి హైస్కూల్‌కి చెందిన ఐదుగురు, గుండుగొలను కెపిఆర్ఎం కళాశాలకు చెందిన ముగ్గురు, గుండుగొలను హైస్కూల్‌కి చెందిన 11 మంది ఇంటర్ మొదటి సంవత్సరం పరీక్షలకు హాజరుకానున్నారు. గీతాంజలి కళాశాలకు చెందిన 72 మంది పోలసానిపల్లి (బాలికల) గురుకులంకు చెందిన 53 మంది ద్వారకాతిరుమల శ్రీ శ్రీనివాస కళాశాలకు చెందిన 50 మందితో కలిపి మొత్తంగా 175 మంది భీమడోలు శ్రీవెంకటేశ్వర జూనియర్ కళాశాల వేదికగా నిర్వహించే ఇంటర్ రెండో సంవత్సరం పరీక్షలకు హాజరు కానున్నారు. పోలసానిపల్లి గురుకులం బాలికల పాఠశాల వేదికగా నిర్వహించే పరీక్షా కేంద్రంలో మొదటి సంవత్సరం పరీక్షలకు 225 మంది రెండో సంవత్సరం పరీక్షలకు 253 మంది హాజరుకానున్నారు. వీరికి అదనంగా ఇంటర్ రెండో సంవత్సరం పరీక్షలకు 44 మంది ప్రయివేట్ అభ్యర్థులు 26 మంది గీతాంజలి వృత్తి విద్యా కళాశాలకు చెందిన విద్యార్థులు హాజరుకానున్నారు. ఇదే కేంద్రంలో నిర్వహించే ఇంటర్ మొదటి సంవత్సరం పరీక్షలకు భీమడోలు శ్రీ వెంకటేశ్వర కళాశాలకు చెందిన 120 మంది, పోలసానిపల్లి బాలయోగి గురుకులంకు చెందిన 24 గీతాంజలి కళాశాలకు చెందిన 15 మంది ద్వారకా తిరుమల శ్రీనివాస కళాశాలకు చెందిన 22 మంది, రెండో సంవత్సరం పరీక్షలకు హాజరు కానున్నారు. ఇంటర్ ఫస్టియర్ పరీక్షలకు శ్రీ వెంకటేశ్వర కళాశాలకు చెందిన 147 గీతాంజలి కళాశాలకు చెందిన 16 ద్వారకాతిరుమల శ్రీ శ్రీనివాస కళాశాలకు చెందిన 15 మంది, గుండుగొలను జెడ్‌పిహెచ ఎస్ స్కూల్‌కు చెందిన ఇద్దరు, గుణ్ణంపల్లి హైస్కూల్‌కి చెందిన ఇద్దరు, పోలసానిపల్లి గురుకుల పాఠశాలకు చెందిన 22 గుండుగొలను కెపిఆర్ఎం కళాశాలకు చెందిన ఒకరు హాజరుకానున్నారని తెలిపారు. పరీక్షలను జంబ్లింగ్ విధానంలో నిర్వహించనున్నారు. కేటాయించిన హాల్ టికెట్లపై వారి పరీక్షా కేంద్రాలు వివరాలు ఉన్నాయన్నారు. పరీక్షలకు హాజరయ్యే వారు పరీక్షా కేంద్రాలకు 30 నిమిషాలు ముందుగా చేరుకోవాలని కోవిడ్ నిబంధనలను పాటించాలని కోరారు. ఆర్‌టిసి వారు పరీక్షలు హాజరయ్యే వారికోసం ప్రత్యేక బస్సు సర్వీసులు నిర్వహిస్తున్నారన్నారు. పరీక్షా కేంద్రాల వద్ద శాంతి భద్రతల కోసం 144 సెక్షన్ విధించినట్లు భీమడోలు తహశీల్దార్ షంషుద్దీన్ తెలిపారు

హాల్ టికెట్ లింక్ విడుదల చేయాలి : పిడిఎస్‌యు

ఏలూరు టౌన్ : ఇంటర్మీడియట్ పరీక్షలు సమీపిస్తున్న నేపథ్యంలో ప్రయివేట్ కార్పొరేట్ విద్యాసంస్థలు విద్యార్థుల దగ్గర నుంచి ఫీజులను బలవంతంగా వసూలు చేస్తూ పెండింగ్ ఫీజులు కడితేనే హాల్ టికెట్లు ఇవ్వబోమని చెబుతు న్న నేపథ్యంలో ఆర్ఐఒ చంద్రశేఖర్ బాబును పిడిఎస్‌యు నాయకులు సోమవారం కలిసి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా పిడిఎస్‌యు జిల్లా అధ్యక్షులు కాకి నాని మాట్లాడుతూ ఫీజులు కట్టమని ఒత్తిడి చేస్తూ హాల్ టికెట్లు ఆపుతున్న నేపథ్యంలో ప్రభుత్వం రెండు, మూడు సంవత్సరాల నుంచి విద్యార్థులకు ఉపశమనం కలిగించేలా బోర్డ్ ఆఫ్ ఇంటర్మీడియట్ నుంచి లింక్ విడుదల చేస్తుందన్నారు. దీని ద్వారా విద్యార్థులు స్వయంగా హాల్‌టికెట్‌ని డౌన్‌లోడ్ చేసుకుని, ఎగ్జామ్స్ సెంటర్‌కి వెళ్లి ప్రశాంతంగా పరీక్షలు రాసేవారన్నారు. కానీ ఈ ఏడాది లింక్ విడుదల చేయకపోవడం వెనుక ప్రయివేట్, కార్పొరేట్ విద్యాసంస్థల ఎత్తున లాబీయింగ్ జరిగిందని అర్థమవుతుందని నాని అన్నారు. ఇప్పటివరకు లింక్ విడుదల చేయకపోవడం వల్ల అనేక కారణాలతో ఫీజులు కట్టలేని పరిస్థితులు ఉన్నటువంటి విద్యార్థులు తీవ్రమైన ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. దీనిని ఆసరా చేసుకొని ప్రయివేట్, కార్పొరేట్ యాజమాన్యాలు హాల్ టికెట్లు ఇవ్వాలంటే కచ్చితంగా ఫీజు అంత పూర్తిగా కడితేనే ఇస్తామని విద్యార్థులను మానసికంగా ఇబ్బందులకు గురి చేస్తున్నారని తెలిపారు. ప్రభుత్వం టోల్ ఫ్రీ నెంబర్ ఇచ్చిన గాని దానివల్ల పెద్దగా ఉపయోగం లేకపోవడం వల్ల విద్యార్థులు ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. వెంటనే ప్రభుత్వం లింక్ విడుదల చేసి విద్యార్థులను పరీక్షలు ప్రశాంతంగా రాసుకునే వాతావరణాన్ని కల్పించాలని నాని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పిడిఎస్‌యు ఏలూరు నగర ప్రధాన కార్యదర్శి ఎం.జానకిరామ్ పాల్గొన్నారు.

వైసిపి హయాంలోనే గ్రామాల అభివృద్ధి : మేకా వెంకట ప్రతాప్

ప్రజాశక్తి - ముసునూరు

సిఎం జగన్ హయంలోనే గ్రామాల అభివృద్ధి సాధ్యమని కృష్ణా డిసిసిబి ఛైర్మన్ తన్నీరు నాగేశ్వరరావు, నూజివీడు శాసనసభ్యులు మేకా వెంకటప్రతాప్ అప్పారావు అన్నారు. మండలంలోని పలు అభివృద్ధి పనులను సోమవారం వారు ప్రారంభించారు. తొలుత కోర్లగుంటలో రూ.15 లక్షల ఎంపీ నిధులతో నిర్మిస్తున్న కమ్యూనిటీహాలుకు శంకుస్థాపన చేశారు. అనంతరం ముసునూరులో రూ.40 లక్షలతో నిర్మించిన సచివాలయం-2ను ప్రారంభించారు. కమ్యూనిటీ హాలుకు శంఖుస్థాపన, రూ.14 లక్షలతో నిర్మించిన రైతు భరోసా కేంద్రం ప్రారంభోత్సవం, కాట్రేనీపాడులో రైతుభరోసా కేంద్రం ప్రారంభోత్సవం, వంతెన నిర్మాణానికి శంఖుస్థాపన, గోపవరంలో కో-ఆపరేటవ్ బ్యాంకు భవనం ప్రారంభోత్సవం, నూతన బోరు ప్రారంభం, బలివేలో రూ.40 లక్షలతో నిర్మించిన సచివాలయం, వలసపల్లిలో రూ.15లక్షల ఎంపీ నిధులతో నిర్మించిన కమ్యూనిటి హాలు, చక్కపల్లిలో రూ.25 లక్షలతో నిర్మించిన సచివాలయం, లోపూడిలో రూ.17.67 లక్షలతో నిర్మించిన పాలవెల్లువ మహిళా సహకార సంఘ భవనం ప్రారంభించారు. అలాగే ఇదే గ్రామంలో రూ.16 లక్షలతో నిర్మించనున్న గ్రంథాలయానికి శంఖుస్థాపన, బిసి ఏరియాలో రూ.15.70 లక్షల ఎంపీ నిధులతో నిర్మిస్తున్న కమ్యూనిటీ హాలుకు శంకుస్థాపన, వేబ్రిడ్జి కాటా ప్రారంభోత్సవం, బిసి ఏరియాలో వాటర్ ట్యాంకు శంఖుస్థాపన, వాటర్‌ట్యాంకు ట్రాక్టర్ ప్రారంభోత్సవం ఇలా పలు కార్యక్రమాలను వారు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ పరపతి సంఘం రాష్ట్ర అధ్యక్షులు దేశిరెడ్డి రాఘవరెడ్డి, జెడ్‌పిటిసి సభ్యులు వరికూటి ప్రతాప్, ఎంపిపి రావర్ల కృష్ణకుమారి, సుబ్బారావు, వైస్ ఎంపిపి కోటగిరి రాజానాయన, మండల నాయకులు మూల్పూరి నాగవల్లేశ్వరరావు, బి.నరిసింహారావు, సర్పంచులు నక్కనబోయిన సత్యనారాయణ, కొండేటి విజయలక్ష్మి, లావు ప్రవీణాసుధాకర్, చలసాని దామెదర్‌రావు, పేరం కృష్ణ, తహశీల్దార్ దాసరి సుధ, ఎంపిడిఒ జి.రాణీ, పలుశాఖల అధికారులు, నాయకులు, ఎంపిటిసిలు పాల్గొన్నారు.

రోడ్లపై స్టాపర్స్ ఏర్పాటు

ప్రజాశక్తి - నూజివీడు రూరల్

మండలంలోని సీతారామపురంలో రోడ్డు ప్రమాదాల నివారణకు సోమవారం స్టాపర్స్ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా నూజివీడు రూరల్ ఎస్ఐ తలారి రామకృష్ణ మాట్లాడుతూ దాతల సహాయ సహకారంతో వీటిని ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. వాహనదారులు రోడ్డు నిబంధనలు పాటించాలని, అతివేగం ప్రమాదకరమని సూచించారు.

వ్యాధిగ్రస్తునికి మానవత సాయం

ప్రజాశక్తి - భీమడోలు

వైద్యం చేయించుకునేందుకు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న పోలసానిపల్లికి చెందిన యువకునికి మానవత స్వచ్ఛంద సంస్థ చేయూతనందించింది. సంస్థ జిల్లా అధ్యక్షులు రామిశెట్టి గంగాధరరావు తెలిపిన వివరాల మేరకు, పోలసానిపల్లి బిసి కాలనీకి చెందిన కూన శివప్రసాద్ పేగుకు సంబంధించిన వ్యాధితో బాధపడుతున్నాడు. విషయం తెలుసుకున్న సంస్థ సభ్యులు రూ.ఐదు వేలు సాయం చేశారు. ఈ కార్యక్రమంలో మానవత భీమడోలు శాఖ ఛైర్మన్ గుళ్ల నూకరాజు, గోనుగుంట రమణ శంకర్ పాల్గొన్నారు.

గ్రామసభలను వినియోగించుకోండి

భీమడోలు:మండల పరిధిలోని రైతు భరోసా కేంద్రాల వారీగా ఈనెల 14వ తేదీ నుంచి 17 వరకూ నిర్వహించే గ్రామసభలను సద్వినియోగం చేసుకోవాలని భీమడోలు వ్యవసాయాధికారి ఉషారాణి కోరారు . 2022-23 రబీ సీజన్‌కు రైతు భరోసా కేంద్రాల వారీగా ఇ-క్రాప్ ముసాయిదా జాబితాను సామాజిక తనిఖీల కోసం ప్రదర్శనగా ఏర్పాటు చేయనున్నామన్నారు. మండల పరిధిలో 13,401 ఎకరాల ఇ-క్రాప్ నమోదు పూర్తయిందని, ఇకెవైసి నమోదు కార్యక్రమం 96 శాతం పూర్తయిందన్నారు. ఈ నేపథ్యంలో ముసాయిదా జాబితాలో వివరాల నమోదుపై అభ్యంతరాలు, మార్పులు ఇతరాలను కోరే రైతులు సంబంధిత గ్రామ సచివాలయ వ్యవసాయ సహాయకులను సంప్రదించాలన్నారు.

17 వరకూ ఇ-క్రాప్ సామాజిక తనిఖీ

ప్రజాశక్తి - చింతలపూడి

మార్చి 13 నుంచి 17 వరకు ఇ-క్రాప్, ఇ-కెవైసి నమోదు వివరాలు అని రైతు భరోసా కేంద్రాల వద్ద తెలియజేస్తామని చింతలపూడి వ్యవసాయాధికారి ఎఒ మీనాకుమారి సోమవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. మండలంలో 8,500 ఎకారాల వరి, మొక్కజొన్న పంట సాగవుతుందని తెలిపారు. ఈ పంటల నిమిత్తం ఇ- క్రాప్, ఇ-కెవైసి 96 శాతం నమోదైందని పేర్కొన్నారు. తుది జాబితను రైతు భరోసా కేంద్రాల వద్ద మార్చి 13 నుంచి 17 వరకు చదివి వినిపించనున్నట్లు తెలిపారు. ఏమైనా ఇబ్బందులు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని పేర్కొన్నారు.

బుట్టాయగూడెం : రబీ పంట నమోదు ముగియడంతో పంట నమోదు వివరాలను సామాజిక తనిఖీ నిమిత్తం మండలంలోని అన్ని రైతు భరోసా కేంద్రాల వద్ద ఈ నెల 17వ తేదీ వరకు ఉంచుతారని మండల వ్యవసాయాధికారి బి.సుమలత తెలిపారు. గ్రామసభలు నిర్వహిస్తారని రైతులందరూ అభ్యంతరాలు ఉంటే తెలియజేయాలి చెప్పారు. 13న బుట్టాయగూడెం, సీతప్పగూడెం, విప్పలపాడు, లక్ష్ముడుగూడెం, 14న కోటనాగవరం, పులిరాముడుగూడెం, దొరమామిడి, అలివేరు, 15న తెల్లంవారిగూడెం, కోట రామచంద్రాపురం, కామయ్యకుంట, రాజానగరం 16న అంతర్వేదిగూడెం, జైనవారిగూడెం, రెడ్డి గణపవరం, 17న నూతిరామన్నపాలెం, అచ్చయ్యపాలెం, నిమ్మలగూడెం గ్రామాల్లో సభలు నిర్వహించనున్నట్లు తెలిపారు.

నేడు నూజివీడు బడ్జెట్ సమావేశం

ప్రజాశక్తి - నూజివీడు

2023-2024 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన నూజివీడు మున్సిపల్ బడ్జెట్ సమావేశం ఈనెల 14వ తేదీన నిర్వహిస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ రషీద్ మహ్మద్ ఒక ప్రకటనలో తెలిపారు. గత ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన బడ్జెట్ కేటాయింపులు, ఖర్చులు, మిగులుతో కూడిన ఖాతా లెక్కలు, వాటి వివరాలను చర్చిస్తూ, నూతన ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన ప్రణాళికను రూపొందించి నూజివీడు అభివృద్ధికి తోడ్పడేలా బడ్జెట్ ఉంటుందని కమిషనర్ తెలిపారు.

ఒటిఎస్ పట్టాల పంపిణీ

ప్రజాశక్తి - కైకలూరు

ఒటిఎస్ ద్వారా పరిష్కారం ఎంతో మేలని శాసన సభ్యులు దూలం నాగేశ్వరరావు తెలిపారు. మండలంలోని ఆచవరంలో లబ్ధిదారులకు ఒటిఎస్ పట్టాలను పంపిణీ చేశారు. జగనన్న హౌసింగ్ కాలనీలో ఇళ్ల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి అడవి వెంకట కృష్ణమోహన్, వైస్ ఎంపిపి మహ్మద్ జహీర్, హౌసింగ్ ఎఇ శేఖర్, పంచాయతీ కార్యదర్శి రవి కిరణ్, ఒటిఎస్ లబ్ధిదారులు, ఇళ్ల స్థలాల లబ్ధిదారులు పాల్గొన్నారు.

జనసేన ఆవిర్భావ సభ జయప్రదానికి పిలుపు

ప్రజాశక్తి - నూజివీడు

కృష్ణా జిల్లా మచిలీపట్నంలో ఈనెల 14న జరిగే జనసేన ఆవిర్భావ దినోత్సవ సభకు జన సైనికులు వేలాదిగా తరలి రావాలని ఆ పార్టీ నూజివీడు నియోజకవర్గ నాయకులు బర్మా ఫణిబాబు పిలుపునిచ్చారు. నూజివీడులో ఆయన సోమవారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. జన సైనికులు కలిసికట్టుగా పనిచేసి సభను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. అడవినెక్కలం నుండి నూజివీడు రాజీవ్ సర్కిల్ మీదుగా కార్లు, మోటార్ సైకిళ్లతో భారీ ర్యాలీగా మచిలీపట్నం చేరుకుంటామని, సమీప ప్రాంతాల్లోని జనసేన సైనికులను కలుపుకుంటూ భారీ ఊరేగింపు నిర్వహించనున్నట్లు ఫణిబాబు వివరించారు.

పోలవరం:జనసేన ఆవిర్భావ దినోత్సవ సభను జయప్రదం చేయాలని ఆ పార్టీ మండల అధ్యక్షులు గునపర్తి చిన్ని పిలుపునిచ్చారు. కన్నాపురం అడ్డరోడ్డు వద్ద సోమవారం నిర్వహించి జనసేన మండల నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మార్చి 14వ తేదీన మచిలీపట్నంలో జనసేన పార్టీ పదో ఆవిర్భావ దినోత్సవం జరుగుతుందని, ఉదయం పోలవరం నుంచి బస్సు బయలుదేరుతుందని తెలిపారు. అధిక సంఖ్యలో జనసేన సైనికులు వచ్చి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

దస్తావేజు లేఖరి మృతికి సంతాపం

ప్రజాశక్తి - భీమడోలు

ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన పోలసానిపల్లికి చెందిన దస్తావేజుల లేఖరి సవలం సత్యనారాయణ మృతికి సంతాపంగా లేఖర్లు సోమవారం పెన్‌డౌన్ చేపట్టారు. కుటుంబ సభ్యులకు అండగా ఉంటామని హామీ ఇచ్చారు.

పేరు మార్పు ప్రకటన

పంపన వెంకటేశ్వరరావు (కొత్త పేరు) తండ్రి: వెంకట స్వామి (కొత్త పేరు), గతంలో నా పేరు బంపన శ్రీనివాసరావు (పాత పేరు) తండ్రి: బంపన స్వామి (పాత పేరు) డోర్ నెం. 8-9, పొలమూరు గ్రామం, పెనుమంట్ర మండలం, పశ్చిమ గోదావరి జిల్లా, ఆంధ్ర ప్రదేశ్ నందు నివసించుచున్నాను. **ఇప్పుడు నా పేరును బంపన శ్రీనివాసరావు (పాత పేరు) తండ్రి: బంపన స్వామి (పాత పేరు) నుండి పంపన వెంకటేశ్వరరావు (కొత్త పేరు) తండ్రి: వెంకట స్వామి (కొత్త పేరు) గా మార్చుకున్నాను.** ఈ రోజు నుండి తదుపరి అన్ని లవాదేవీల కోసం నా కొత్త పేరును ఉపయోగించవలెను. సెల్: 8179333761.